ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 సిద్దిపేట
మంగళవారం 1 సెప్టెంబరు 2026

# తాటి చెట్టుకు ఇనుప నిచ్చెన

- వర్షాకాలంలో ప్రమాదాలకు చెక్
- పోల్ క్లైంబింగ్ ప్రేరణతో.. సిద్దిపేట గీత కార్మికుడి సరికొత్త ఆలోచన
- ఒక్కో నిచ్చెనకు రూ.5 వేల వరకు ఖర్చు
- ఏడాదిలో 10 నెలల పాటు కల్లు గీతతో ఉపాధి
- "వాటే ఐడియా గౌడన్నా!" అంటూ అభినందనలు

5లో..

# నిబంధనలు తుస్!

- సిద్దిపేట పట్టణంలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- పలు భవనాలకు ఆక్యుపెన్సీ లేకుండానే నిర్వహణ
- అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..
- అక్రమార్జనే ధ్యేయంగా చక్రం తిప్పుతున్న పలువురు మున్సిపల్ అధికారులు!
- ప్రభుత్వ ఆదాయానికి గండి!

యూజీడీకి అనుసంధానం కాకపోవడంతో ఓ భవనం నుంచి వస్తున్న మురుగునీరు

సిద్దిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అనుమతి గోరంతా.. నిర్మాణాలు కొండంతా అన్నట్లుగా సిద్దిపేట పట్టణంలో అక్రమ కట్టడాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. ఒక ప్లాన్ చూపించి మున్సిపల్ అనుమతులు పొందడం, ఆచరణలో మరో ప్లాన్‌తో నిబంధనలకు తిలోదకాలు ఇవ్వడం ఇక్కడ సర్వసాధారణమైంది. సెట్‌బ్యాక్‌లు గాలికి వదలడం, అదనపు అంతస్తులను నిర్మించడం, పార్కింగ్ స్థలాలను కబ్జా చేయడం వంటి అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అసలు ఎలాంటి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేకపోయినా భారీ భవనాలను వినియోగంలోకి తెస్తుండటం గమనార్హం.

పట్టణంలోని సుడా కార్యాలయం సమీపంలో ఇటీవల నిర్మించిన ఓ భవనమే ఇందుకు నిదర్శనం. ప్రధాన భవనానికి అనుమతి తీసుకున్న యజమాని.. వెనుక వైపు ఉన్న విశాలమైన ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇలాంటి కట్టడాలతో మున్సిపాలిటీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం గండిపడుతోంది. పట్టణంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని ఆసరాగా చేసుకుని కొందరు భూయజమానులు నిబంధనలను పూర్తిగా బేఖాతర్ చేస్తున్నారు.

### పార్కింగ్, సెట్‌బ్యాక్ లేకుండానే...

భవన నిర్మాణ సమయంలో ప్లాట్ విస్తీర్ణం, ఎత్తు, రోడ్డు వెడల్పును బట్టి టీజీ-బీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉంటోంది. సెట్‌బ్యాక్ నిబంధనలను పాటించకుండా పూర్తి స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో వాహనాలన్నీ రోడ్లపైనే పార్క్ చేయాల్సి వస్తుండటంతో ప్రయాణికులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ అనుమతులకు విరుద్ధంగా ఇష్టానుసారంగా అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్‌లు వెలుస్తున్నాయి.

### ఓసీ లేకున్నా కార్యకలాపాలు..

భవనాలు పూర్తయిన తర్వాత వాటిని వినియోగంలోకి తేవడానికి తప్పనిసరిగా ఉండాల్సిన "ఆక్యుపెన్సీ సర్టిఫికెట్" (ఓసీ) లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ భవనాల్లోకి కార్పొరేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ వచ్చి చేరాయి. అసలు ఓసీ పత్రం లేకపోయినా, సంబంధిత శాఖల నిబంధనలను పక్కనపెట్టి విద్యుత్ కనెక్షన్లు పొందుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) కనెక్షన్లు ఇవ్వకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారి కుంటలుగా మారుతున్నా, స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల్లో స్పందన కరువైంది.

### లంచాల మత్తులో మున్సిపల్ యంత్రాంగం!!

నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను తనిఖీ చేసి అడ్డుకోవాల్సిన కొందరు మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలు కాలనీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక నిబంధనల ప్రకారం ఓసీ ఇవ్వాలంటే భవన కొలతలు, సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం వంటివి పరిశీలించాల్సి ఉండగా.. ఆ తనిఖీలను పక్కనబెట్టి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓసీ కావాలంటే భవన పరిమాణాన్ని బట్టి రూ. 5 లక్షలకు పైగా ముట్టజెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లంచాల రూపంలో దండుకున్న సొమ్మును పంచుకుంటూ కొందరు అధికారులు అక్రమార్జనే ధ్యేయంగా చక్రం తిప్పుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# మండల్ ప్రజావాణి..!

- అధికారుల నిర్లక్ష్యం.. సమయపాలన నిల్
- అర్జీదారుల అనాసక్తి.. అరకొరగా దరఖాస్తులు
- జిల్లా కేంద్రానికి తగ్గని వినతుల సంఖ్య

అక్బల్‌పేట- భూంపల్లి మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అధికారులు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రజావాణిపై అటు అధికారులు.. ఇటు అర్జీదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కలెక్టర్ సమక్షంలో నిర్వహించే ప్రజావాణికి వెళ్లేందుకే మొగ్గుచూపుతున్నారు. మండలస్థాయిలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అధికారులు అందుబాటులో లేకపోవడం ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. నిర్ణీత సమయానికి ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ, చాలా చోట్ల అధికారులు ఆలస్యంగా రావడం లేదా అసలు హాజరు కాకపోవడం జరుగుతోంది. కొన్ని మండలాల్లో కేవలం కొద్దిమంది అధికారులు మాత్రమే విధుల్లో కనిపిస్తున్నారు. మిగతా అధికారులకు ప్రజావాణి పై ఎందుకింత నిర్లక్ష్యం అని ఆర్జీదారులు మండిపడుతున్నారు. మండల కేంద్రంలో ప్రజావాణికి ఆర్జీదారులకు ఎలాంటి అవగాహన లేదు. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉన్నది.

### ప్రజావాణికి 103 వినతులు స్వీకరణ

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 103 దరఖాస్తులు - మిగతా 6లో..

# రైతుల పక్షాన బీజేపీ

- 22 ఏను రద్దు చేయకపోతే అసెంబ్లీని నడవనివ్వం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- సర్కారు భూములను అమ్మి డబ్బులు ఢిల్లీకి తీసుకెళ్తున్న రేవంత్ రెడ్డి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- రేవంత్‌కు రైతులకు మేలు చేసే ఆలోచన లేదు
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

ధర్నాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీలు రఘునందన్‌రావు, అరవింద్, నాయకులు

సిద్దిపేట క్రైం ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎల్లప్పుడూ రైతుల పక్షానే ఉంటుందని, భూసేకరణ చట్టంలోని 22ఏ నిబంధనను రద్దు చేయకపోతే అసెంబ్లీని నడవనివ్వమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు 22ఏ రద్దు కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ నిబంధన వల్ల 50 లక్షల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ సర్వే నంబర్ 403లో మొత్తం భూమిని 22ఏ జాబితాలో చేర్చి, కేవలం తమకు సంబంధించిన రెండు ప్లాట్లను మాత్రమే మినహాయించుకున్నారని విమర్శించారు.

### వచ్చిన డబ్బు ఢిల్లీకి : రఘునందన్‌రావు

మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ భూములు అమ్మి వచ్చే డబ్బులను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు, కాలువలలో పోగా మిగిలిన భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏలో పెడుతోందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చే రేషన్ బియ్యంపై ప్రధానమంత్రి మోదీ బొమ్మ ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు.

### డబ్బు సంపాదన మీదే ధ్యాస : ధర్మపురి అరవింద్

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల సంక్షేమం కంటే డబ్బు సంపాదనపైనే ధ్యాస ఎక్కువని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ 16 ఎకరాల భూమిని కబ్జా చేశారని, రైతుల నుంచి భూములు గుంజుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, విద్యాసాగర్, తుంగ కనరయ్య, గంగాడి మోహన్ రెడ్డి, దూది శ్రీకాంత్ రెడ్డి, బాసంగారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మాపూర్‌లో ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

# విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం
- త్వరలో హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమీ
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్ది, ఆదర్శవంతంగా మారుస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ గ్రామ శివారులో రూ. 14.56కోట్లతో శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల బాలురు, బాలికల వసతి గృహాల భవన నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్ హైస్కూల్ 75 సంవత్సరాల వేడుకల సందర్భంగా ఇక్కడ ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చిందన్నారు. సీఎం పర్యటన సందర్భంగా పెద్దపల్లిలో ఇంజనీరింగ్ కళాశాలను కోరగా వెంటనే మంజూరు చేశారని తెలిపారు. మొదటి సంవత్సరంలో 240 మందికి 60 మంది విద్యార్థులు చేరినా, ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు అందించి ప్రోత్సహించామని, రెండో సంవత్సరానికి వచ్చేసరికి 120 మంది చేరగా, జీరో ఉన్న ఐటీలో 175 మంది విద్యార్థులు చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు.

### నియోజకవర్గంలో విద్యా సంస్థలు

మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్న హుస్నాబాద్‌ను విద్యాహబ్‌గా మార్చడంలో భాగంగా, కోహెడలోని తంగళ్లపల్లిలో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. సీఎం హామీ మేరకు కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో మరో ఇంటిగ్రేటెడ్ స్కూల్, చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ రానున్నాయని, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో నవోదయ స్కూల్, ఎల్కతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించే బాధ్యత తనదని, కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించే బాధ్యత విద్యార్థులదేనని స్పష్టం చేశారు. హుస్నాబాద్‌లో త్వరలోనే కబడ్డీ అకాడమీతో పాటు ఆధునిక స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తామన్నారు. అలాగే అక్కన్నపేట మండలంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. విద్యా బోధనలో అకాడమిక్ సైడ్ చిన్నలోటు ఉన్నా వైస్ చాన్స్‌లర్‌దే బాధ్యతన్నారు. ఎలాంటి సౌకర్యాలైనా ఏర్పాటు చేసే బాధ్యత తనదేనన్నారు. మంచి మార్కులు సాధించి ఇక్కడే ఉద్యోగాల కోసం ప్లేస్‌మెంట్ సాధించే విధంగా కష్టపడి చదవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కళాశాల బోర్డు మెంబర్ రజిత, సర్పంచ్ చొప్పరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో గౌరవెల్లిని సందర్శించనున్న సీఎం

త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి సందర్శించనున్నారని మంత్రి పొన్నం తెలిపారు. అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా, దాసుతండా, చాపగానితండా, కన్నారం, పంతులుతండా గ్రామాల్లో పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి అదనంగా
# రూ. 3 కోట్లు

హుస్నాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులకు మరో రూ.3 కోట్ల నిధులు సోమవారం మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. ఈ చెరువు సుందరీకరణ పనులు ఇప్పటికే రూ. 18 కోట్లతో జరుగుతుండగా, అదనంగా మరో రూ.3కోట్లు మంజూరు కావడంతో పనులు మరింత వేగంగా పూర్తికానున్నాయి. త్వరలోనే ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు, గ్లాస్ బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు.

### కలెక్టరేట్‌కు రూ. 10 వేల
# జరిమానా

గజ్వేల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వని జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రాష్ట్ర సమాచార కమిషన్ రూ. 10 వేల జరిమానా విధించింది. రెండు వారాల్లోగా బాధితులకు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించినట్లు మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితులు తెలిపారు. కలెక్టరేట్ వద్ద వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రెండు వారాల్లో సమాచారం అందించాలని 2025 సెప్టెంబరు 16న రాష్ట్ర సమాచార కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టరేట్ అధికారులు పాటించలేదు. ఈ నిర్లక్ష్యంపై వేములఘాట్‌కు చెందిన హయతోద్దీన్, ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన సందబోయిన అశోక్, లక్ష్మాపూర్‌కు చెందిన ప్రభాకర్ 2026 ఫిబ్రవరి 4న రాష్ట్ర సమాచార కమిషన్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై 2026 జూలై 20న విచారణ జరిపిన కమిషన్.. హయతోద్దీన్ దాఖలు చేసిన ఐదు దరఖాస్తులకు సంబంధించి రూ.6వేలు, అశోక్ దరఖాస్తుకు రూ. 2వేలు, ప్రభాకర్ దరఖాస్తుకు రూ. 2వేలు చొప్పున మొత్తం రూ. 10వేల జరిమానా విధించింది. రెండు వారాల్లోగా పూర్తి సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. అధికారులు తమ తప్పులు బయటపడకుండా జాగ్రత్త పడడమే ఇందుకు కారణమని వారు అనుమానం వ్యక్తం చేశారు.

### మరణంలోనూ వీడని స్నేహబంధం

- 40 ఏళ్ల స్నేహితుడి మృతిని తట్టుకోలేక గుండెపోటు
- ఒకే రోజు ఇద్దరూ మృతి

5

### విద్యార్థుల్లో ఫీజు బకాయిల కలవరం

- అందని రీయింబర్స్‌మెంట్
- ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్న కళాశాలల యాజమాన్యాలు

5

### మద్యం మత్తులో బ్లేడ్‌తో వ్యక్తిపై దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు
- కోహీర్ మండల పరిధిలోని కవేలి గ్రామంలో ఘటన

4

# రైతుబంధు ఆగమైంది.. రైతుబీమా గల్లంతైంది

- కేసీఆర్ హయాంలో రాని కరెంట్,ఎరువుల కష్టాలు ఇప్పుడెందుకు..?
- వంద రోజులు పోయి వెయ్యి రోజులొచ్చినా హామీలు అమలు కాలేదు
- స్కూళ్లు ప్రారంభమై మూడు నెలలైనా విద్యార్థులకు యూనిఫామ్స్ లేవు
- మళ్లీ కేసీఆర్ వస్తేనే రాష్ట్ర ప్రజలకు, రైతులకు మంచి భవిష్యత్తు
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో ఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్/సిద్దిపేటఅర్బన్/సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి); కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రైతుబంధు పథకం ఆగమైందని, రైతుబీమా గల్లంతయిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు, రైతులకు సురక్షితమైన భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

### రైతు సంక్షేమానికి తూట్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఎరువులు, కరెంటుకు ఎలాంటి కష్టాలు రాలేదని, నేడు యూరియా, డీఏపీ కోసం రైతులు 15 రోజుల పాటు క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు. గతంలో దురదృష్టవశాత్తూ రైతులు మృతి చెందితే రూ.5లక్షల రైతుబీమా అందేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 14 నుంచి ఆ పథకాన్ని పూర్తిగా నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధును కొందరికిచ్చి మరికొందరికి ఎగబెడుతూ ప్రభుత్వం మోసం చేస్తోందని ధ్వజమెత్తారు.

### విద్యా వ్యవస్థ నిర్లక్ష్యం..

స్కూళ్లు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫామ్స్ అందలేదని హరీశ్‌రావు విమర్శించారు. యూనిఫామ్స్ కాంట్రాక్టును గుజరాత్‌కు చెందిన "మఫత్‌లాల్" కంపెనీకి కట్టబెట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్కూళ్లు ప్రారంభం కాకముందే విద్యార్థులకు రెండు జతల బట్టలు అందించేవారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేస్తున్నారని, జీవో 97 కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. "మన ఊరు-మన బడి" కార్యక్రమాన్ని రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు.

### మోసపూరిత హామీలు..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. రూ. 4వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. ఆసుపత్రుల్లో బాలింతలకు ఇచ్చే కేసీఆర్ కిట్‌ను నిలిపివేశారని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారమని మోసం చేశారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి చెక్కులు పిల్లలు పుట్టిన తర్వాత ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

### పలు కార్యక్రమాల్లో..

సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రతిష్టా మహోత్సవానికి హరీశ్‌రావు - మిగతా 6లో..

## మద్యం మత్తులో బ్లేడ్‌తో వ్యక్తిపై దాడి

● పోలీసుల అదుపులో నిందితుడు

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని కవేలి గ్రామంలో సోమవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మద్యం మత్తులో జరిగిన గొడవ తీవ్ర స్థాయికి చేరి ప్రాణాంతక దాడికి దారితీసింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని వెంచర్ వద్ద ఇస్మాయిల్, రాజు అనే ఇద్దరు వ్యక్తులు కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో క్షణికావేశానికి గురైన రాజు.. తన వద్ద ఉన్న హ్యాక్సా బ్లేడ్‌తో ఇస్మాయిల్ మెడపై బలంగా దాడి చేశాడు. దీంతో ఇస్మాయిల్ మెడ భాగంలో తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాడికి పాల్పడిన నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మెడపై హ్యాక్సా బ్లేడ్ గుచ్చుకుని తీవ్ర రక్తస్రావంతో ఉన్న క్షతగాత్రుడు ఇస్మాయిల్

# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

● అధికారులను ఆదేశించిన డీఆర్వో, అదనపు కలెక్టర్లు
● మెదక్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు
● మండలకేంద్రాల్లో మొక్కుబడిగా నిర్వహణ
● మెదక్‌లో 48, సంగారెడ్డిలో 71 అర్జీలు

మెదక్/సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేయాలని మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులు స్పష్టం చేశారు. సోమవారం ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 48 దరఖాస్తులను డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్ స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పాండు, సంగీత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్‌లో 3 చొప్పున మొత్తం 71 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. పింఛన్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, భూ సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు వినతులు సమర్పించారు.

మెదక్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు పాండు, సంగీత

### పలు మండలాల్లో కొనసాగిన ప్రజావాణి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహ మండల స్థాయి ప్రజావాణికి ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. కొన్ని మండలాల్లో అధికారులే గైర్హాజరుకాగా, మరికొన్ని చోట్ల ఒకటి రెండు దరఖాస్తులతో ప్రజావాణి తూతూ మంత్రంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో జరిగిన ప్రజావాణి విశేషాలు ఇలా ఉన్నాయి..

● రేగోడు : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి కేవలం ఒక్కటే దరఖాస్తు వచ్చింది. జిల్లా కేంద్రం మెదక్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదని, గతంలో నడిపిన మెదక్ డిపో బస్సులను పెద్దశంకరంపేట, రేగోడు మీదుగా నారాయణఖేడ్ వరకు నడిపించాలని కోత్వాల్‌పల్లి మాజీ ఎంపీటీసీ నర్సింలు ఫిర్యాదు చేశారు.

● మనోహరాబాద్ : ఎంపీడీవో కార్యాలయంలో 4 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి తహసీల్దార్, ఆర్అండ్‌బీ, వెటర్నరీ అధికారులు గైర్హాజరయ్యారు.

● పటాన్‌చెరు : మండలంలో మొత్తం 8 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 5, నీటిపారుదల శాఖకు 1, ఇస్నాపూర్ పురపాలక సంఘానికి సంబంధించిన 2 వినతులు ఉన్నాయి.

● పుల్‌కల్ : చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మొత్తం 21 శాఖల అధికారులకుగాను 14 మందే హాజరయ్యారు.

● నారాయణ ఖేడ్ : మండలంలో రోడ్లు సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతిపత్రం అందజేశారు.

● నిజాంపేట(ఎన్) : మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి.

ఖేడ్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నేతలు

## హత్య, పోక్సో కేసుల్లో వ్యక్తికి జీవిత ఖైదు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, హత్య కేసులో నిందితుడికి సిద్దిపేట న్యాయస్థానం జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 2005 మార్చి 1వ తేదీన ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు నమోదైంది. మైనర్ బాలికను వివాహం చేసుకుని, ఆ తర్వాత హత్య చేసి మృతదేహాన్ని దాచిపెట్టిన ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అప్పటి సిద్దిపేట టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ సమగ్ర దర్యాప్తు జరిపి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీ, కోర్టు మానిటరింగ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, టూటౌన్ కోర్టు సీడీవో లింగారెడ్డి, భరోసా లీగల్ అధికారి సౌమ్య తదితరులు సమన్వయంతో వ్యవహరించి సాక్ష్యాలను కోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిదితుడిని దోషిగా నిర్ధారించి కారాగార శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అధికారులు, సిబ్బందిని సీపీ రష్మీ పెరుమాళ్ అభినందించారు.




# అభూత కల్పన.. ఆగిన శుభకార్యం

● మూఢనమ్మకాల నీడలో టీటీడీ కల్యాణ మండపం
● 21 ఏళ్లుగా ఒక్క శుభకార్యానికీ నోచుకోని వైనం!
● కూలిన ప్రహరీ, శిథిలావస్థకు చేరుకుంటున్న భవనం

పాపన్నపేట మండలంలో 21 ఏళ్లుగా వృథాగా ఉన్న కళ్యాణమంటపం

పాపన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూడుముళ్లు పడాల్సిన చోట.. మూఢనమ్మకాల నీడ పడింది. పెళ్లిళ్లు, శుభకార్యాలతో కళకళలాడాల్సిన టీటీడీ కల్యాణ మండపం.. ప్రారంభమై 21 ఏళ్లు గడిచినా ఒక్క శుభకార్యానికీ నోచుకోలేదు. ప్రజల అవసరాల కోసం గొప్ప ఆశయంతో నిర్మించిన ఈ భవనానికి, స్థానికంగా ప్రచారంలో ఉన్న 'దెయ్యం' కథే శాపంగా మారింది.

### ఎకరం ఐదు గుంటల స్థలంలో నిర్మాణం

పాపన్నపేట మండల కేంద్రంలో సరైన కల్యాణ మండపాలు లేకపోవడంతో.. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ టీటీడీ ఆధ్వర్యంలో మండపం నిర్మించాలని భావించారు. 1983లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న కర్ణం రామచంద్రరావు దీనికి శ్రీకారం చుట్టారు. మండల అభివృద్ధి కార్యాలయానికి ఎదురుగా ఎకరం ఐదు గుంటల స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకులు కొనుగోలు చేసి టీటీడీకి రాసిచ్చారు. గ్రామం తరఫున రూ.50 వేల విరాళం కూడా సమకూర్చగా, మిగతా మొత్తాన్ని ప్రభుత్వం భరించింది. అన్ని హంగులతో నిర్మించిన ఈ మండపాన్ని 2005 నవంబర్ 24న అప్పటి ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ప్రారంభించారు.

### రాజకీయ విభేదాలు.. 'దెయ్యం' ప్రచారం

మండపానికి ఆనుకుని ఒకప్పుడు పాడుబడిన రైస్‌మిల్లు ఉండేది. అక్కడ దెయ్యం తిరుగుతుందనే ప్రచారం గతంలో ఉండేది. అయితే, మండప ప్రారంభ సమయంలో స్థానిక నాయకుల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు, ఆధిపత్య పోరు ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. రైస్‌మిల్లులోని దెయ్యం కల్యాణ మండపంలోకి వచ్చిందని, అక్కడ శుభకార్యాలు చేస్తే అరిష్టం కలుగుతుందంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మూఢనమ్మకం ప్రజల్లో తీవ్రంగా నాటుకుపోవడంతో, ఎవరూ అక్కడ పెళ్లిళ్లు చేసేందుకు ముందుకు రాలేదు.

వృథాగా బోరుబావి

### శిథిలావస్థకు భవనం..

నిర్వహణ లోపం కారణంగా కాలక్రమంలో భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. మండపం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ కూలిపోయింది. బోరుబావి చెడిపోయింది. భవనంలో పలుచోట్ల మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీటీడీ మేనేజర్ సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దయనీయంగా ఉంది. భవన మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే ఎస్టిమేషన్లు పంపామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఏటా కేటాయించే నిధులపై స్పష్టత లేకపోవడం గమనార్హం. ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మించిన ఈ భవనం మూఢనమ్మకాల కారణంగా నిరుపయోగంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి.. కూలిన ప్రహరీని నిర్మించి, బోరును పునరుద్ధరించి, భవనాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఈ కల్యాణ మండపాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ప్రేమ వివాహం తిరస్కరించారని యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తమ కులం కాదని ప్రేమ వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు సీఐ రవీందర్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు జేపీకాలనీకి చెందిన వైష్ణవి(23) ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న ఇంటిలోనే అభి అనే యువకుడు అద్దెకు ఉంటుండగా, వైష్ణవి.. అభి ప్రేమలో పడ్డారు. ఇదే విషయాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పి, తమకు వివాహం చేయాలని కోరింది. అయితే, తమ కులం కాదని తల్లిదండ్రులు తిరస్కరించారు. అప్పటి నుంచి ముబావంగా ఉంటున్న వైష్ణవి ఆదివారం పరిశ్రమకు సెలవు కావడంతో ఇంటివద్దే ఉంది. తల్లిదండ్రులు పని నిమిత్తం వెళ్లారు. తర్వాత యువతి తండ్రికి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారంటూ అడిగింది. కొద్దిసేపటి తర్వాత తండ్రి కుమార్తెకు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే ఇంటికి వెళ్లి చూడగా గది తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలోంచి చూడగా, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందికి దించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం పట్టివేత

నంగునూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వచేసిన వ్యక్తుల ఇళ్లపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీస్ సిబ్బంది, రాజగోపాలపేట పోలీసులు సోమవారం ఏకకాలంలో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున బియ్యాన్ని పట్టుకున్నారు. నంగునూరు మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన మోతే సాయి తరుణ్ ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 150 సంచుల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. ఈ బియ్యాన్ని ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు, ఎక్కడికి తరలించాలనుకుంటున్నారనే కోణంలో విచారణ జరుపుతున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. అసాధారణ రీతిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

రామచంద్రపూర్‌లో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

నిచ్చెన సాయంతో తాటి చెట్టు ఎక్కుతున్న నేరెళ శ్రీనివాస్ గౌడ్

# తాటి చెట్టుకు ఇనుప నిచ్చెన!

- వర్షాకాలంలో ప్రమాదాలకు చెక్
- పోల్ క్లైంబింగ్ ప్రేరణతో.. సిద్దిపేట గీత కార్మికుడి సరికొత్త ఆలోచన
- ఒక్కో నిచ్చెనకు రూ.5 వేల వరకు ఖర్చు
- ఏడాదిలో 10 నెలల పాటు కల్లు గీతతో ఉపాధి
- "వాటే ఐడియా గౌడన్న!" అంటూ అభినందనలు

మద్దూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి తాటిచెట్లు ఎక్కి కల్లు గీస్తుంటారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని సార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వర్షాకాలంలో అయితే ఈ ప్రమాద తీవ్రత మరింత పెరుగుతుంది. ఇలాంటి ముప్పునకు చెక్ పెడుతూ సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు నేరెళ్ల శ్రీనివాస్ ఒక అద్భుతమైన ఐడియాతో ముందుకు వచ్చారు. తాడి చెట్లు ఎక్కేందుకు ఏకంగా నిచ్చెనలు ఏర్పాటు చేశారు. ఒక్కో చెట్టుకు శాశ్వతంగా ఉండేలా ఏర్పాటు చేసిన ఈ ఇనుప నిచ్చెలతో ఏ కాలంలో అయినా భయం లేకుండా చెట్లు ఎక్కుతున్నారు.

**పోల్ క్లైంబింగ్ చెప్పులను చూసి.....**

విద్యుత్ శాఖ సిబ్బంది పోల్ క్లైంబింగ్ చెప్పుల సహాయంతో సులభంగా కరెంట్ స్తంభాలు ఎక్కడం చూసిన శ్రీనివాస్‌కు ఒక ఆలోచన తట్టింది. తాటి చెట్లకు కూడా శాశ్వత ప్రాతిపదికన నిచ్చెనలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని భావించారు. వెంటనే ఒక్కో చెట్టుకు రూ.5 వేల ఖర్చుతో ఇనుప నిచ్చెనలను చేయించి బిగించారు. నిచ్చెన గట్టిగా ఉండేందుకు ప్రతి మూడు మీటర్లకు ఒక రౌండ్ ఇనుప పట్టీని అమర్చడమే కాకుండా, చెట్టు పైభాగానికి వెళ్లాక సురక్షితంగా తిరిగి కల్లు తీయడానికి ప్రత్యేకంగా ఒక జాలిని సిద్ధం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన తన వద్ద ఉన్న 13 చెట్లకు ఈ నిచ్చెనలను విజయవంతంగా అమర్చారు. సాధారణంగా వర్షాలు, ముసురు పెట్టినప్పుడు చెట్లు ఎక్కడం కుదరక గీత కార్మికులు ఆదాయం కోల్పోతుంటారు. కానీ నిచ్చెనల పుణ్యమా అని శ్రీనివాస్ ఇప్పుడు భారీ వర్షంలోనూ రెయిన్ కోట్ వేసుకుని భయం లేకుండా చెట్టెక్కి కల్లు తీస్తున్నారు. దీనివల్ల ప్రమాదాల భయం తగ్గడమే కాకుండా, ఏడాదిలో దాదాపు 10 నెలల పాటు జీవనోపాధి లభిస్తోందని శ్రీనివాస్ చెబుతున్నారు. స్వయం కృషితో ప్రమాదాలకు స్వస్తి చెప్పి, సురక్షితమైన మార్గాన్ని వెతుక్కున్న నేరెల్ల శ్రీనివాస్ సృజనాత్మకతను చూసి స్థానికులు "వాటే ఐడియా గౌడన్న!" అంటూ అభినందిస్తున్నారు.

కల్లు గీస్తున్న శ్రీనివాస్ గౌడ్

## రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది టీఆర్ఎస్సే..

- సర్కార్‌కు 120 రోజుల్లో వంద చెరువుల నీళ్లు తాగించాం
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీనేనని రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీని స్థాపించి 120 రోజులు అయిందని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ రేవంత్ సర్కార్‌కు వంద చెరువుల నీళ్లు తాగించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేపటికి వెయ్యిరోజులు అవుతుందని, ఇప్పటికీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. తమ పార్టీ ఆవిర్భవించిన నుంచి అన్నివర్గాల సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రధాన ప్రతిపక్షంగా ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువతతో పాటు నిరుద్యోగులు, దివ్యాంగులు, మైనార్టీ, బడుగు, బలహీనవర్గాల కోసం తమ పార్టీ పని చేస్తుందన్నారు. నారాయణఖేడ్‌లో బాపు మల్‌శెట్టి ఆధ్వర్యంలో పార్టీ ముందుకు సాగుతుందని, ప్రజలు సహకరించాలన్నారు. నారాయణఖేడ్‌లో ఇప్పటివరకు రెండు, మూడు కుటుంబాల పాలనే సాగుతుందని, రానున్నరోజుల్లో మార్పు కోసం తమ పార్టీకి సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, టీఆర్ఎస్ నాయకుడు అరుణ్‌రాజ్ శేరికార్, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సిద్దిపేటలో జరుగుతున్న యూనియన్ రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కామున్ని గోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్ రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా కె చంద్రశేఖర్, జి భాస్కర్, సూరం పద్మ, మోహన్, పుష్ప, ఎం ఏ చౌదరి, కార్యదర్శులుగా ఇప్పకాయల శోభ, కే.సత్యం, ఎస్.రాజు, సులోచన, కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో కార్తీక్ ప్రతిభ

కార్తీక్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆడెపు కార్తీక్ ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ మట్టా సంపత్‌కుమార్ రెడ్డి తెలిపారు. తుర్కపల్లికి చెందిన కార్తీక్, సుప్రసిద్ధ భారతీయ మల్లయోధుడు గులాం మహమ్మద్ బక్ష్ భట్‌ను ప్రేరణగా స్వీకరించి బాల్యంనుండే మల్లయుద్ధవిద్య పట్ల ఆసక్తిని పెంచుకున్నాడని, స్వయంకృషితో ఎదిగి ఎస్. టీ. నారాయణ రెజ్లింగ్ క్లబ్ ద్వారా తన నైపుణ్యాలను పెంపొందించుకున్నాడన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన సందర్భంగా సోమవారం కార్తీక్‌ను కళాశాల ప్రిన్సిపల్ జి. సునీత అభినందించి, ఇటువంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామవిద్య ఇన్‌చార్జి అధ్యాపకుడు బాలకిషన్, జాతీయ సేవాపథకం యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు మహేశ్ కుమార్, శైలజ, పుణ్యమ్మ, విశ్వనాథం, హరిబాబు కార్తీక్‌ను అభినందించారు.

## ప్యాక్స్ పాలకవర్గాలను ఎన్నికల ద్వారానే ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్‌కు పీఏసీఎస్ చైర్మన్లు, రైతుల వినతి

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు

పుల్‌కల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) పాలకవర్గాలను నామినేషన్ పద్దతి ద్వారా కాకుండా ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయాలని సొసైటీ చైర్మన్లు, రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పాండుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 908 పీఏసీఎస్‌ల పదవీ కాలం ముగిసి ఏడాదికి పైగా గడించిందన్నారు. సొసైటీల పాలకవర్గాల పదవీ కాలాన్ని ఇప్పటికే రెండు సార్లు పొడిగించారని గుర్తు చేశారు. వేలాది మంది రైతులు సభ్యులుగా ఉన్న సొసైటీలను నామినేషన్ పద్దతితో నియమించేందుకు ప్రభుత్వం యత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సహకార చట్టం 1964, కేంద్ర ప్రభుత్వం నియమించిన వైద్యనాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సహకార సంఘాల్లో ప్రభుత్వ జోక్యం పరిమితంగా ఉండాలని సూచించిందన్నారు. పదవీ కాలం పూర్తయిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలని 2005లో అప్పటి ప్రభుత్వం ఆమోదించిన సిఫారసులు మేరకు పాలకవర్గం గడువు ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు నిర్వహించాలని సూచించిందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సొసైటీ చైర్మన్లు అనంతరావుకులకర్ణి, పట్నం మాణిక్యం, రాజు, బుచ్చిరెడ్డి, బిక్షపతి తదితరులున్నారు.

## వర్షాధార పంటగా వరి సాగుపై పరిశోధనలు

- ఇక్రిశాట్ డీడీజీ స్టాన్‌ఫోర్డ్ బ్లాడే

మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌శెట్కార్

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాధార పంట తరహాలో వరిని సాగు చేసేందుకు పూర్తిస్థాయి పరిశోధనలు జరుగుతున్నట్లు ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్‌ఫోర్డ్ బ్లాడే తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో కొజర్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో 'వరి వరహేలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎనిమిది జిల్లాల నుంచి రైతులు హాజరయ్యారు. ఆరుతడి పంట తరహాలో ప్రయోగాత్మకంగా వరి సాగు చేసిన రైతులకు ఈ సందర్భంగా ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ సురేష్ శెట్కార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భారత్‌పై ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో.. వర్షాభావ పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలపై ప్రైవేటు భాగస్వామ్యంతో పరిశోధనలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకుంటున్నామన్నారు. నీటి వనరులు తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో, వరి సాగును సైతం ఆరుతడి పంటలా మార్చేందుకు పూర్తిస్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొజర్ క్లైమేట్ సంస్థ ప్రతినిధి సూరజ్ తేజ మాట్లాడుతూ.. ఎనిమిది జిల్లాల్లో లక్ష మంది రైతులను ఎంపిక చేసి ఆరుతడి పద్ధతిలో వరి సాగు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అయ్యే అన్ని రకాల ఖర్చులను తమ సంస్థే భరిస్తున్నట్లు వివరించారు. ఈ పద్ధతి ద్వారా ఎకరానికి వరి దిగుబడి గణనీయంగా పెరిగిందన్నారు. వాస్తవంగా సాధారణ పద్ధతిలో ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, ఆరుతడిగా సాగు చేస్తున్నప్పుడు 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని చెప్పారు. ఇలా ఎనిమిది జిల్లాల్లోని రైతుల పొలాల్లో నాలుగేళ్లుగా పరిశోధనలు విజయవంతంగా జరుగుతున్నాయని, దీనివల్ల వరిపై ఉన్న నీటి పంట అనే ముద్ర రానున్న రోజుల్లో తొలగిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## హెచ్‌ఆర్‌లో ఏఐ విప్లవానికి ఐఐటీహెచ్ వేదిక

- సెప్టెంబర్ 11న ప్రత్యక్ష ప్రాక్టికల్ శిక్షణ
- పాల్గొనేవారికి ఐఐటీహెచ్ సర్టిఫికెట్

కంది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) :ఏఐ ఉద్యోగ ప్రపంచాన్ని మార్చేస్తున్న నేపథ్యంలో, మానవ వనరుల నిర్వహణ రంగంలో పనిచేస్తున్న నిపుణులకు అత్యాధునిక ఏఐ సాంకేతికతపై సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఏఐ లాంచ్‌ప్యాడ్, ఐఐటీ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ నిపుణుల కోసం 'ఏజెంటిక్ ఏఐ'పై ప్రత్యేకంగా ఒకరోజు ప్రత్యక్ష, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు సోమవారం ఐఐటీహెచ్ అధికారులు ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 11న ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వర్క్‌షాప్ జరగనుంది. ఉద్యోగ నియామకాలు, సిబ్బంది ప్రణాళిక, ఉద్యోగుల శిక్షణ, ప్రతిభ నిర్వహణ, పనితీరు అంచనా వంటి హెచ్‌ఆర్ విభాగాల్లో ఏఐని సమర్థవంతంగా ఎలా వినియోగించాలనే అంశాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. ఇందులో ప్రధానంగా ఏఐ ఆధారిత ఉద్యోగ నియామకాలు, రెజ్యూమ్ పార్సింగ్, వర్క్‌ఫోర్స్‌ప్లానింగ్, హెచ్‌ఆర్ అనలిటిక్స్, స్మార్ట్ ఆన్‌బోర్డింగ్, ఉద్యోగుల అభ్యాసం, కెరీర్ మొబిలిటీ, పనితీరు నిర్వహణ, రోజువారీ హెచ్‌ఆర్ కార్యకలాపాల్లో ఏఐ వినియోగానికి ఆచరణాత్మక వ్యూహాలపై శిక్షణ ఇస్తారు. అంతేగాక ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే వారికి ఐఐటీ హైదరాబాద్ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ కంప్లీషన్ అందజేయనున్నారు. రిక్రూటర్లు, హెచ్‌ఆర్ బిజినెస్ పార్ట్‌నర్లు (హెచ్‌ఆర్‌బీపీ), లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాధిపతులు, వర్క్‌ఫోర్స్ ఆపరేషన్స్ మేనేజర్లు ఇందులో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. పరిమిత సంఖ్యలోనే సీట్లు అందుబాటులో ఉన్నందున ఆసక్తి గల హెచ్‌ఆర్ నిపుణులు ముందుగానే నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## నర్సాపూర్ ఆర్డీవో గణిత పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు

- జపాన్ జర్నల్ స్ప్రింగర్ నేచర్‌లో ప్రచురణ

నర్సాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, గణిత శాస్త్రంపై మక్కువతో మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ అరుదైన ఘనత సాధించారు. ఆయన చేసిన గణిత పరిశోధనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడమే కాకుండా, ప్రపంచ ప్రఖ్యాత జపాన్ జర్నల్ 'స్ప్రింగర్ నేచర్'లో ప్రచురితమైంది. ఈ సందర్భంగా రామకృష్ణను పలువురు అభినందిస్తున్నారు. తన పరిశోధనలోని గణిత పద్ధతి భవిష్యత్తులో వంతెనలు, వివిధ నిర్మాణాల్లో బీమ్స్ వంగే విధానాన్ని లెక్కించడానికి, అలాగే, నిర్మాణాలపై పడే భారాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని ఆర్డీవో రామకృష్ణ తెలిపారు. ఎంఆర్ఐ, ఈసీజీ వంటి వైద్య పరీక్షల్లో ఎదురయ్యే 'బౌండరీ వాల్యూ' సమస్యలను మరింత సులభంగా పరిష్కరించడానికి ఈ పరిశోధన దోహదపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తన పరిశోధనలకు అంతర్జాతీయ గుర్తింపు రావడానికి సహకరించిన అందరికీ ఈ సందర్భంగా రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తజనసంద్రం..

వీరభద్ర స్వామి ఆలయంలో వ్రతాలు..

ఝరాసంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర అమృత గుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లలో బారులు తీరారు. మహారాష్ట్రలోని హమ్మాదాపూర్ నుంచి వేలాది సంఖ్యలో భక్తులు కేతకీ సంగమేశ్వర స్వామి దర్శనం కోసం పాదయాత్రగా తరలివచ్చారు. వీరు ఆదివారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

**ఘనంగా వీరభద్రస్వామి శ్రావణ ఉత్సవాలు**

గుమ్మడిదల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస మూడో సోమవారం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బ్రహ్మాచారి, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఫీజు బకాయిల కలవరం

- ప్రభుత్వం నుంచి అందని రీయింబర్స్‌మెంట్
- ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్న కళాశాలల యాజమాన్యాలు
- ఉన్నత చదువులకు ఆటంకం

నిరసన వ్యక్తం చేస్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు (ఫైల్)

కొండపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్సులు పూర్తిచేసినప్పటికీ, ఫీజు బకాయిలు చెల్లించలేదనే కారణంతో కొన్ని కళాశాలల యాజమాన్యం సర్టిఫికెట్లు, ఇతర విద్యా పత్రాలు ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కొండపాక మండలం వెలికట్ట శివారులోని ఓ ఫార్మసీ కళాశాలలో నాలుగు సంవత్సరాల బీఫార్మసీ పూర్తిచేసిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వీరంతా కౌన్సిలింగ్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రవేశం పొందారు. ఒక్కో విద్యార్థి పేరు మీద సుమారు రూ.80 వేల వరకు బకాయిలు ఉండటంతో, ఆ మొత్తం చెల్లించాలంటూ కళాశాల యాజమాన్యం పట్టుబడుతోంది. చదువు పూర్తయిన తర్వాత ఎం-ఫార్మసీ వంటి ఉన్నత విద్యకు వెళ్లాలన్నా, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరి. యాజమన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో తమకు సీట్లు వచ్చినా చేరలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఎం-ఫార్మసీలో చేరాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో తామేం చేయాలో అర్థం కావడం లేదంటూ ఇటీవల కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు.

**మాజీ మంత్రిని ఆశ్రయించిన విద్యార్థులు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు నష్టపోతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటలోని క్యాంప్ కార్యాలయానికి సోమవారం రాత్రి వచ్చిన విద్యార్థులు.. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో తమ సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యను తెలుసుకున్న హరీశ్‌రావు వెంటనే కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. దీంతో యాజమాన్యం కస్టోడియన్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినట్లు తెలిపారు. రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విద్యార్థులకు ఆయన భరోసా ఇచ్చారు.

## ఎల్లుండి ఉద్యోగుల క్రీడా జట్టు ఎంపికలు

- ఇన్‌చార్జి డీవైఎస్‌వో అఖిలేశ్‌రెడ్డి

అఖిలేశ్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్స్ 2026-27 పాల్గొనుటకు సంగారెడ్డి జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 3న నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి డీవైఎస్‌వో అఖిలేశ్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్, హాకీ, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నీస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బస్ట్, ఖోఖో, యోగ, బాస్కెట్‌బాల్, షటిల్ బాడ్మింటన్, ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్, కబడ్డీ తదితర క్రీడా ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రాష్ట్ర ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యోగులు సర్వీస్ సర్టిఫికేట్ లేదా ఐడీ కార్డుతో 3వ తేదీన డీవైఎస్‌వో కార్యాలయంలో సంప్రదించాని కోరారు. ఎంపికైన వారు సెప్టెంబరు 8, 9 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

## ఉత్సాహంగా మహిళా క్రికెట్ జట్టు ఎంపికలు

ఎంపికైన ఉమ్మడి మెదక్ జిల్లా మహిళా జట్టు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ మహిళా జట్టు ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి 50 మంది మహిళలు హాజరయ్యారు. ఎంపికల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ఇండియా మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సునీతా ఆనంద్ సెలెక్టర్‌గా వ్యవహరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడామణులను వెలికి తీసేందుకు ఈ ఎంపికలు నిర్వహించినట్టు అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఖలీం, అనిల్, ఇనాం, లక్ష్మణ్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మరణంలోనూ వీడని స్నేహబంధం

- 40 ఏళ్ల స్నేహితుడి మృతిని తట్టుకోలేక గుండెపోటు
- ఒకే రోజు ఇద్దరూ మృతి

మల్లయ్య, అంజయ్య (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 31: (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరిది 40 ఏళ్ల స్నేహబంధం. ఇద్దరికీ ఇప్పుడు 60 ఏళ్లు. 40 ఏళ్లుగా కలిసిమెలిసి, ఒకరికి మరొకరు తోడుగా ఉన్నారు. ఓ స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైన అతని స్నేహితుడు గుండెపోటుతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య 49 సంవత్సరాల క్రితం కొల్చారం మండలంలోని రంగంపేట నుండి కూకుట్లపల్లికి ఇల్లరికం వచ్చాడు. అప్పడి నుండి అదే గ్రామానికి చెందిన గొల్ల అంజయ్యతో స్నేహ బంధం ఏర్పడింది. సోమవారం తెల్లవారు జామున చాకలి మల్లయ్య (60) అనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుడి మరణం వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గొల్ల అంజయ్య(60)కు ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడిక్కడే మృతి చెందాడు. నలబై ఏళ్లుగా విడదీయరాని స్నేహితులుగా ఉన్న ఇద్దరు ఒకే రోజు మృతి చెందడంతో కూకుట్లపల్లిలో విషాద చాయలు అలుముకున్నాయి.

## 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- కవల పిల్లలకు జననం

కంగ్టి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కంగ్టి మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని సిద్ధహంగిర్గ గ్రామానికి చెందిన మరియమ్మ సోమవారం పురుటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. పాప, బాబు (కవలలు) జన్మించారు. ఈఎంటీ గుండప్ప, పైలట్ వసంత అప్రమత్తంగా వ్యవహరించి తల్లికి, పుట్టిన శిశువులకు తగిన సపర్యలు చేసి ప్రాథమిక వైద్యం అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వారిని కంగ్టి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, పిల్లలు అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## నూతన మూల్యాంకన విధానాన్ని వెనక్కితీసుకోవాలి

- ఆర్‌యూపీపీటీఎస్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నూతన మూల్యాంకన విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీటీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిరాజు శశియాదవ్ డిమాండ్ చేశారు. విద్యా శాఖ ఏకపక్ష నిర్ణయంపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర పాఠశాల విద్యలో విద్యార్థుల సమగ్ర వికాసం, ఒత్తిడి లేని అభ్యసనం, నిరంతర మూల్యాంకనం లక్ష్యంగా అమలులోకి వచ్చిన సీసీఈ విధానానికి విరుద్ధంగా.. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఆందోళనకరమని తెలిపారు. సీసీఈ అనేది కేవలం పరీక్షల విధానం కాదని, విద్యార్థి సమగ్ర వికాసాన్ని నిరంతరం అంచనా వేసే విద్యా ప్రక్రియ అని పేర్కొన్నారు. విద్యార్థిని రోజువారీ తరగతి గదిలో పరిశీలిస్తూ, అతని సామర్థ్యాలు, లోటుపాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు సరిదిద్దే బాధ్యత బోధించే ఉపాధ్యాయుడిదేనని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే పునఃపరిశీలించి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**LAND FOR SALE**

★ జనగాం-హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్రనేల తూర్పుఫేసింగ్‌తో 600 ఫీట్ల పొడవు 150 ఫీట్ల వెడల్పుతో బోర్/ జాలి ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రీఫామ్స్ / ఏఫామ్‌కైనా / ఏతోటకైనా అనుకూలం. సం॥ప్ర॥ 8019095973 AJW-4274

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్ పోటీలు

సిద్దిపేట రూరల్/మద్దూరు,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో అండర్ 14 అండ్ 17 విభాగంలో బాలబాలికలకు ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలను సెప్టెంబరు 2 నుంచి 3 వరకు నిర్వహిస్తున్నట్లు మండల ఆర్గనైజర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ క్రీడలు దూళిమిట్ట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2న బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖోతో పాటు అథ్లెటిక్, వాలీబాల్, 3న బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తో పాటు అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు.

●సిద్దిపేట రూరల్ : మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తామని మండల విద్యాధికారి గౌరీ మోహన్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ గేమ్స్‌ను నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ తోట సతీష్ ను సంప్రదించాలని సూచించారు.

## బాలికలు, మహిళల అభ్యున్నతికి తోడ్పడాలి

● మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ

చేర్యాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీతత్వ సమాజంలో బాలికలు, మహిళలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి తోడ్పాడునందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజరమణ అన్నారు. సోమవారం చేర్యాల పట్టణంలోని కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశనుంచి బాలిక, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నరేందర్, కమీషన్ ఎస్ఓలు భారతి, సుల్తానా, సునీత, కౌన్సిలర్ కవిత, సిద్దిపేట జిల్లా మహిళా శిశుసంక్షేమాధికారి శారద, మునిసిపల్ కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, జిల్లా జండర్ అండ్ ఈక్విటీ కో ఆర్డినేటర్ నర్మద, ఎస్ఐ అపూర్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో యూనిఫాం పంపిణీ

కోహెడ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్లో గ్రామ సర్పంచ్ పెరుక సరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం ప్రిన్సిపాల్ రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని చదువుకోవాలని, పాఠశాల పేరును జిల్లా స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సేవలకు ముగింపు కాదు

ఎంపీడీవోను సన్మానిస్తున్న ఆయా శాఖాల ఉద్యోగులు

సిద్దిపేట రూరల్,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సేవలకు ముగింపు కాదని., విశ్రాంత జీవితంలోనైనా ఉద్యోగ జివితంలో తమ అనుభవాలను జూనియర్‌లతో భాగస్వామ్యం చేసుకునే అవకాశం ఉంటుందని జెడ్పీ సీఈవో రమేష్ పేర్కొన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిషత్ ఎంపీడీవో చెక్కబండి జగన్మోహన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో రమేష్, డిపివో రవిందర్‌లతో పాటు ఆయా శాఖా అధికారులు ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జయంత్, ఏఓ పరశురాంరెడ్డి, ఆయా శాఖాల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో భద్రత

కొండపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను నివారించడంలో సీసీ కెమెరాలు కీలకమని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవాని పేర్కొన్నారు కొండపాక మండలం మర్పడగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన మిలాన్ గ్రూప్ అధినేత అజుముద్దీన్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు శ్రీ సీఐ లక్ష్మి బాబు, గ్రామ సర్పంచ్ ఆకారం బాలరాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సరోజ శ్రీనివాస్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పెద్ది విటల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమయ్య, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు విజయ దాత అజిముద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ, ఉపాధ్యాయులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బైపాస్‌రోడ్డు బాగుపడేనా..?

●రోడ్డంతా గుంతలమయం

పాడైపోయిన బైపాస్‌రోడ్డు

బైపాస్‌రోడ్డులో ఏర్పడిన గోతులలో నిలిచిన నీరు

చేర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డు పాడైపోయి ఏళ్ల గడుస్తున్నా పట్టించుకున్ననాథుడే కరువయ్యాడు. రోడ్డంతా గుంతలమయమవడంతో ప్రజలు, ప్రయాణికులు నానాతంటాలుపడుతున్నారు. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. అంగడిబజారు మీదుగా ధూళిమిట్ట, నంగునూరు, మద్దూరు, హుస్నాబాద్, జనగామ తదితర మండలాలకు ప్రయాణిస్తున్న క్రమంలో సింగిల్‌లేన్ రోడ్డు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. దీంతో చాలా ఏళ్ల క్రితం జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి ఆనుకుని బాలాజీ థియేటర్ చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ కాలనీ వరకు బైపాస్‌రోడ్డు వేశారు. కానీ నిర్వహణ పట్టించుకోకపోవడం, నాసిరకంగా పనులు చేపట్టడం, అధికలోడు వాహనాలతో రోడ్డు దెబ్బతిని గుంతలమయమైంది. వర్షా కాలంలో అధ్వానంగా మారుతుంది. గత బీఆర్ఎస్ హయాంలో రోడ్డు మరమ్మతుల నిర్వహణకు రూ.1.10కోట్లు నిధులు మంజూరుచేసింది. కానీ టెండర్ పొందిన కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టలేదు. ప్రభుత్వం మారడంతో ప్రారంభించని రోడ్డు పనుల నిధులు వెనక్కి మలించడంతో ఆచరణకు నోచుకోలేదు. మరమ్మతులకు నోచుకోక నానాటికి రోడ్డు అధ్వానంగా మారుతూ వస్తుండటంతో వాహనాలను పెద్దమ్మగడ్డ నుంచి అంబేడ్కర్ నగర్ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో అంబేడ్కర్‌నగర్ కాలనీలో బీటీరోడ్డు కూడా దెబ్బతింది. అంబేడ్కర్‌నగర్ రోడ్డువిస్తరణ పనులు చేపట్టవద్దని పలువురు, చేపట్టాలని మరికొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండటంతో అతీగతీ లేకుండా మారాయి.

రోడ్డుమరమ్మతుల నిర్వహణకు నిధులు మంజూరు చేసి శాశ్వతపరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## హామీలను అమలు చేయాలి

సిద్దిపేటరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వృద్ధులకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాముని గోపాల స్వామి అన్నారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని రాజీవ్ యువకిరణాలు పథకానికి ఆంక్షలు పెడుతూ అర్హులైన పేదలకు దొరకకుండా చేస్తున్నారని మండిపడ్డారు. బీడీ కార్మికులందరికి జీవన భృతిని మంజూరు చేయాలన్నారు.సమస్యల పరిష్కారం చేయకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## వీధి దీపాలు ప్రారంభం

వీధి దీపాలు ప్రారంభిస్తున్న మాజీ సుడా చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్ స్థానిక సర్పంచ్

సిద్దిపేటఅర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వై జంక్షన్ నుంచి దుర్గమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ లైన్‌తో పాటు వీధి దీపాలను మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతో కలిసి పొన్నాల సర్పంచ్ అమ్ముల వెంకటయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు .. పొన్నాల వై జంక్షన్ నుంచి పొన్నాల గ్రామం వరకు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి పూట చీకటిగా ఉండేదని, దీంతో సుమారు రూ. 4 లక్షల నిధులతో కొత్త విద్యుత్ లైన్‌తో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. రాత్రి పూట ప్రయాణం చేసే గ్రామ ప్రజలకు, ఇతర వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు.

## అక్బర్‌పేట-భూంపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి/సిద్దిపేట రూరల్/దుబ్బాకరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, , రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై పలు పనులను ప్రారంభించి, నూతన పనులకు భూమిపూజ చేశారు. భూంపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే, ఎంపీ, కమిషన్ చైర్మన్ కలిసి ప్రారంభించారు. అనంతరం భూంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. భూంపల్లి పాఠశాలలో మండల స్థాయి ఎస్ జీఎఫ్ క్రీడలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నూతనంగా మంజూరైన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

### హనుమాన్ ఆలయంలోఎంపీ ప్రత్యేక పూజలు

సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమాన్ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దుబ్బాక మండలం హబ్సీపూర్ మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను జ్యోతిప్రజ్వాళనచేసి స్థానిక ఎమ్మెల్యే కొత్త కొత్త ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కివెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ ఎస్‌జీఎఫ్ క్రీడలకు గాడిపల్లి పౌండేషన్ చైర్మన్ విష్టువర్ధన్‌రెడ్డి ఆర్థిక సహకారాన్ని అందించారు.

## పాత బస్టాండ్ వద్ద బస్‌షెల్టర్ నిర్మాణం

●రూ.3లక్షల వ్యయంతో క్లబ్ కోశాధికారి ఔదార్యం

బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ సుధాకర్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనానికి చేర్యాల లయన్స్‌క్లబ్ అండగా నిలిచింది. ఎంతోమంది ప్రయాణికుల ఇక్కట్లను శాశ్వతంగా నివారించింది. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. చేర్యాల పట్టణంలో చారిత్రక, ప్రధాన చౌరస్తాగా నిలిచిన పాతబస్టాండ్ ఏరియా వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఉండటంతో చాలా సంవత్సరాలక్రితం తాత్కాలిక బస్‌షెల్టర్ నెలకొల్పినప్పటికీ రెండు పర్యాయాలు రోడ్డువిస్తరణ పనుల కారణంగా కూల్చివేశారు. కొంతమేర ఆసరగా నిలిచిన చెట్లు, వృక్షాలనుసైతం నేలకూల్చడంతో ప్రయాణికులకు నిలువనీడ కరువై తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈవిషయమై కొద్దిరోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. స్పందించిన చేర్యాల లయన్స్‌క్లబ్ కోశాధి కారి బెజుగం కొండ య్య తన తల్లిదండ్రులు రాములమ్మ-మల్లేశం స్మారకార్థం సొంతఖర్చులతో షెల్టర్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. రూ.3లక్షల వ్యయంతో కొద్దిరోజులక్రితం పనులు చేపట్టి స్వతహాగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తిచేయించారు. సోమవారం లయన్స్‌క్లబ్ గవర్నర్ ఎన్.సుధాక ర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ, వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమ, కౌన్సిలర్లు కమలాపురం గీతాంజలి, కొమ్ము రాజేశ్వరి, కో-ఆప్షన్ సభ్యురాలు యాట కనకమ్మ, క్లబ్ అధ్యక్షుడు వీరబత్తిని సత్యనారాయణ, ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాస్, ముస్త్యాల బాలనర్సయ్య, యాంసాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సమస్యల వెల్లువ

గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తును అందజేస్తున్న ఎల్లయ్య

గజ్వేల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గజ్వేల్, చేర్యాల, నంగునూరులోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు, సీపీఎం నాయకులు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సీపీఎం నాయకులతో కలసి దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో భాగంగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్తే ఎప్పుడూ ఆర్డీవో అందుబాటులో ఉండడం లేదని, సాధారణ సమయంలో సైతం ఆర్డీవో అందుబాటులో ఉండరని, ఉన్నా ప్రజలకు కలవరని అన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజా సమస్యలపై స్పందించాలని, అందుబాటులో ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ప్రజావాణి రోజున సైతం రావడం లేదని, ప్రజావాణికి హాజరుకాని ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ డివిజన్ కార్యాలయం ప్రారంభించాలని, రింగ్‌రోడ్డు పూర్తి చేయాలని, క్రీడాస్థలాన్ని క్రీడాశాఖకు బదిలీ చేయాలని, జీవో నెంబర్ 6 ప్రకారం వేతనాలను రూ. 15వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### 14రకాల నిత్యావసర సరుకులు అందించాలి

చేర్యాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 14రకాల నిత్యావసర సరుకులు అందించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం మండల అధికారులకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా స్థానిక రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయా సమస్యలపై వినతి పత్రం అందించారు. యూరియా యాప్ పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని, కాంప్లెక్స్ ఎరువులు అందించాలని కోరారు.

### సర్వేయర్ పై చర్య తీసుకోవాలి

నంగునూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భూ సర్వే విషయంలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఓ బాధితుడు సోమవారం నంగునూరులో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని గట్లమల్యాల గ్రామానికి చెందిన పి.నరసయ్య అనే రైతు తనకు సంబంధించిన భూమి సర్వే నంబర్ 564లో భూ సర్వే నిర్వహించే సమయంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించాడు. తన భూమిని సక్రమంగా కొలవకుండా, పక్కనే ఉన్న సర్వే నంబర్ 565లో కలిపినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో తాను తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారుడు. నెల రోజులుగా సర్వే రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ స్పందన లేదని ఆరోపించాడు. ఈ విషయంపై సంబంధిత అధికారులను సంప్రదించినా ఫలితం లేదన్నాడు . సంబంధించిన భూమిపై జరిగిన సర్వే వివరాలను పరిశీలించ న్యాయం చేయాలని కోరాడు. తనకు అన్యాయం చేసిన సర్వేర్ పై చర్య తీసుకొని కోరారుడు. క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి, భూ రికార్డులు సర్వే వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ సందర్భంగా ప్రజావాణిలో 10 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు

## రైతు బంధు ఆగమైంది..

●రైతు బీమా గల్లంతైంది

చికెన్ ప్రాసెసింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

(3వ పేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులను త్వరలోనే దగ్గరుండి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

●సిద్దిపేటలో జరిగిన మెరిడియన్ హైస్కూల్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న 168 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. మొబైల్ దూరంగా ఉంటూ చెస్ వంటి ఆటల తో మెదడుకు పదును పెట్టాలని సూచించారు.

●సిద్దిపేటలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జూనియర్ అసిస్టెంట్ కనకయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

●సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జోగు వేంకటేశ్వర్ల ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కిష్టసాగర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభించి, యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## మం'డల్' ప్రజావాణి..!

(3వ పేజీ తరువాయి)

చేర్యాల మండలలో నిర్వహించిన ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అధికారులు

వచ్చినట్లు చెప్పారు. ఆయా శాఖల్లో ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే డిస్పోసల్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ దరఖాస్తులు స్వీకరించారు.

### ఖాళీగా దర్శనమిచ్చిన అధికారుల కుర్చీలు..

కలెక్టర్ హైమావతి ప్రజావాణి ప్రారంభించి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వెళ్లారు. అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ వినతులను స్వీకరించారు. అయితే పలువురు ఉన్నతాధికారులు మంత్రి ప్రోగ్రాం కు వెళ్లగా పలువురు అధికారులు కలెక్టర్ వెళ్లగానే వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. దీంతో అధికారు కుర్చునే కుర్చీలు ఖాళీగా దర్శనం ఇచ్చాయి

## చిట్టాపూర్‌లో ప్రయాణికుల ధర్నా

చిట్టాపూర్‌లో ధర్నాచేస్తున్న ప్రయాణికులు

దుబ్బాకరూరల్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులు సోమవారం ధర్నా చేపట్టారు. ప్రయాణిలు తెలిపిన వివరాల ప్రకారం...రాఖీ పండుగ స్పెషల్ అని చెప్పి మెదక్ డిపో మేనేజర్ బస్సుచార్జీలు రెండింతలు పెంచారని ప్రయాణికులు ఆరోపించారు. రక్షాబంధన్ పండుగను శిక్షాబంధన్ పండుగా మార్చారని మండిపడ్డారు. రాఖీపండుగ ముగిసి నాలుగురోజుల అవుతుందని, మీరు ఎలా చార్జీలు వేస్తారని సిబ్బందిని నిలదీశారు. ఈవిషయాన్ని తెలుసుకున్న భూంపల్లి, మిరుదొడ్డి ఎస్ఐ రాజశేఖర్, సతీష్‌లు చేరుకుని ప్రయాణికులను సముదాయించారు. జిల్లాలోని ఇతరడిపోల్లో చార్జీలు పెంచలేదని, మీరు ఎలాపెంచుతారని మెదక్ డీపోమేనేజర్‌ను అడిగారు. పెంచే జీవో ఉందని తెలిపారు. కావున ప్రయాణికుల నుంచి తీసుకున్న అదనపు చార్జీలను తిగిరి ఇప్పించడంతో ప్రయాణికులు ధర్నాను విరమించుకున్నారు.

## కాంగ్రెస్ హామీల 'బాకీ కార్డుల' ప్రదర్శన

హుస్నాబాద్,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోగించనుందని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు వొడితల సతీష్‌కుమార్ వెల్లడించారు. సోమవారం హుస్నాబాద్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలం, మున్సిపాలిటీ, గ్రామం, వార్డులో వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాంలో మాజీ హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎండి అన్వర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఉద్యోగ విరమణ

పదవి విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యయురాలు జలజకు సన్మానం చేస్తున్న అతిథులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం ఆకారం ఎమ్‌పీపీఎస్ ప్రధానోపాధ్యయురాలు టి. జలజ పదవి విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోస్ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు హజ్రై పదవి విరమణ పొందుతున్న జలజకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జలజతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉద్యోగ జీవితంలో పదవి విరమణ అనేది సర్వసాధరణమని అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతి రెడ్డి, ఆకారం సర్పంచ్ కాసహంస నాగభూషణం, ఏఏపీసీ చైర్ పర్సన్ దుద్దెడ మౌనిక, ఆకారం ప్రాథమిక పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎమ్ బాలమోహన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయుడు రవీందర్ రెడ్డి, శ్రీ అంకుర హస్పటల్ వైద్యులు డా. నిహార్ గోపాలపురం, డా. శ్రావిక, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో ప్రతిఒక్కరికి భాగస్వామ్యం కల్పించాలి

●రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

దుబ్బాకరూరల్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి పౌరుడికి ఓటుహక్కు ఉండాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, సర్ పక్రియ మెదక్‌పార్లమెంట్ ఇన్‌చార్జి వెన్నెలగద్దర్ అన్నారు. సోమవారం దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామశివారులోని సీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండోవిడుత సర్ పక్రియ బీఎల్ఏ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిబూత్‌లో ఓటరు జాబితాను ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని , కొత్త ఓటర్లనమోదు, డూప్లికేట్ పేర్లను తొలగించాలని తెలిపారు. తప్పుగా తొలగించిన వారి పేర్ల పునరుద్దరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ప్రసాద్‌రెడ్డి, బీఎల్ఏల శిక్షకుడు చైతన్య, దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి,

## సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనతోనే

●గజ్వేల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి

గజ్వేల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనతోనే సాధ్యమని గజ్వేల్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి అన్నారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న పంచజన్య సభకు హాజరయ్యేందుకు గజ్వేల్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆయన తరలివెళ్లారు. ఆయనవెంట మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, నాయకులు లిగాని రాజు, నరేందర్‌రెడ్డి, రాజు, స్వామి, సుధాకర్, రాజలింగం, మధు, కుమార్, స్వామి, తదితరులున్నారు.

## సన్న రకాల పంటల నమోదు తప్పనిసరి

రాయపోల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లిలో సోమవారం రాయపోల్ ఏవో నరేష్ పంటల నమోదుకు డిజిటల్ క్రాప్ బుకి ంగ్ ప్రక్రియను పరిశీలించారు. పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాగు పంట, విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాలను వాస్తవ సాగుకు అనుగుణంగా నమోదు చేయాలని సర్వేయర్లకు సూచించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించిన సన్న రకాల పంటలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. నమోదు చేసుకోని రైతులు డీలర్ బిల్లుతో వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా డీలర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారీ శిరీష, సర్వేయర్ అనిల్, రైతులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

కానిస్టేబుల్ అంజయ్యని సన్మానిస్తున్న సీఐ రవిరాజు

ములుగు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో సక్రమంగా పనిచేసిన ప్రతి వ్యక్తి గుర్తింపు ఉంటుందని గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ములుగు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ అంజయ్య యాదవ్‌ను సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రవి రాజు మాట్లాడారు. అంజయ్య యాదవ్ 1986 లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు.